ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

శిగాలూగుతున్న వనం

- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు

8లో..

పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తుల పరిశీలన వేగవంతం



ఇల్లంతకుంటలో

- గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మలు
- భక్తి పారవశ్యంతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు
- ఎత్తు బంగారం... చీర సారెలు, ఒడిబియ్యం సమర్పణ
- దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ఓబులాపూర్‌లో భక్తుల సందడి



శివంగాలపల్లిలో సమ్మక్కను గద్దెకు తీసుకువస్తున్న పూజారులు

వనం నుంచి వచ్చె సంబురం తెచ్చె..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సమ్మక్క, సారలమ్మ తల్లులు ఇద్దరు కొలువు దీరడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొమ్మిది చోట్ల జాతరలు సందడి నింపింది. మినీ మేడారంలాగా గ్రామాలు మారిపోయాయి. భక్తి పారవశ్యంలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. నిలువెత్తు బంగారంగా బెల్లం, తల్లులకు ఓడి బియ్యం, చీర సారెలను సమర్పించుకుంటూ చల్లంగా చూడాలని శరణు కోరుకుంటున్నారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్, మండెపల్లి, కోనరావుపేట మండలం శివంగళపల్లి, వీర్నపల్లి మండలం శాంతినగర్ భానోతు గిరిజన తండా, బాబాయి చెరువు తండా, ఇల్లంతకుంట మండల కేంద్రతో పాటు వంతడ్పుల, కందికట్కూర్, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ముస్తాబాద్ మండల కేంద్రాల్లో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటున్నారు. ఓబులాపూర్‌లో ఎండ్ల బండ్లతో ఊరేగించారు. సమ్మక్కసారలమ్మ జాతరలకు జిల్లాలోని వివిధ మండలాలకు సంబంధించిన వారితో పాటు హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతా ల నుంచి కూడా ఓబులాపూర్‌కు భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించకున్నారు. సమ్మక్క, సారలమ్మలను ఓబులాపూర్‌లో ప్రభుత్వ విప్ అదిశ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కేంద్రంలో ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ , ప్రజాప్రతినిధులు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది అన్ని చోట్ల కిక్కిరిసిన భక్తులతో పండుగ శోభ ఏర్పడింది.



ఓబులాపూర్‌లో బండ్ల ఊరేగింపు



బంగారాన్ని సమర్పిస్తున్న ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ శివారు నుంచి సమ్మక్కను డప్పుచప్పుళ్ల నడుమ గద్దెపైకి తీసుకువచ్చారు. శివసత్తుల నృత్యాల మధ్య అమ్మవారు గద్దెకు చేరారు. భక్తులు వన దేవతల రాకను చూసి తరలించారు. ఈ నెల 23న బోనాల ఊరేగింపు, మొక్కులు, మహా అన్నదానం, ఈ నెల 24న తల్లులకు ఓడి బియ్యం, మొక్కులు చెల్లించుట, వన ప్రవేశం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని నిర్వహణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఇల్లంతకుంట: రెండు సంవత్సరాల ఒకసారి వచ్చే వనదేవతలు అయిన సమ్మక్కసారలమ్మల ఉత్సవాలు భక్తిప్రపత్తుల మధ్య కొనసాగాయి. మండలంలోని ఇల్లంతకుంట, వంతడుపుల, కందికట్కూర్ గ్రామాలలో గురువారం సమ్మక్కను గద్దెకు కోయపూజారుల మధ్య భక్తులు తీసుకువచ్చారు. భక్తులు ఎత్తు బంగారం, ఎదురుకోలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తుల ఉమ, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ప్యాక్స్‌వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో సమ్మక్కసారాలమ్మ జాతరోత్సావాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సావాల్లో భాగంగా చెట్టు తెచ్చుట, కలశం తెచ్చుట, ఒగ్గు కథ చెప్పుట వంటి కార్యక్రమాలను నిర్వహించారు. బోనాలు తీశా రు. జాతరోత్సావానికి భక్తులు చుట్టు పక్కల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో పూజారి పుల్లూరి మల్లయ్య, పుల్లూరి శ్రీను. పుల్లూరి రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లిలో సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభవం కొనసాగుతోంది. వనదేవతలను దర్శించుకోవడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో గురువారం ఏడ్లబండ్లు తిరగడంతో పాటు గ్రామస్థులు బోనాలను సమర్పించారు. గద్దెకు చేరిన సమ్మక్క, సారలమ్మలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. స్థానిక జడ్పీటీసీ పూర్మాణి మంజుల దంపతులు రూ 1.50 లక్షల వ్య యంతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాన్ని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రారంభించారు. సమ్మక్క సారలమ్మలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బంగారాన్ని సమర్పించారు. అలాగే మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందరెడ్డి, జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానసరాజు, నాయకులు గూడూరి ప్రవీణ్, తుల ఉమ, బొల్లి ఉన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం శాంతినగర్, బాబాయ్ చెరువు తండా గ్రామాల్లో శివసత్తుల పూనకాలు భక్తుల కోలాహలం మధ్య సమ్మక్క దేవత గురువారం వనం ఆలయ పూజారులు గద్దె పైకి తరలించారు. శాంతినగర్ గ్రామంలో సాయంత్రం జినిగాల గుట్టపైకి వెళ్లి ఆలయ పూజారులు భక్తజనులతో కలిసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్క దేవతను ఆలయ పూజారి సమక్షంలో బైండ్ల వారి విన్యాసాలతో గద్దె పైకి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణమంతా భక్తజనులతో నిండిపోయింది. ఆలయం వద్ద ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమటం మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ నాయక్, ఆలయ నిర్వాహకులు రాజు నాయక్, జుంకీలాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో తల్లులను దర్శించుకుంటున్న వినోద్‌కుమార్, తదితరులు



ఇల్లంతకుంటలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు, ముస్తాబాద్‌లో బోనాలతో భక్తులు , వీర్నపల్లి మండలంలో సమ్మక్కను గద్దెపైకి తీసుకువస్తున్న ఆలయ పూజారులు

సంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలి

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 22: సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారన్నారు. గిరిజన ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. గిరిజనులు సంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలని ప్రతి ఒక్కరూ సంత్ సేవాలాల్ జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఆధ్యాత్మిక వేత్తగా, సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. గిరిజన జాతికి మార్గదర్శిగా సేవ చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలోచన విధానాన్ని స్వీకరించి వారి అడుగుజాడల్లో ముందుకు నడవాలని పేర్కొన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. గిరిజనులకు పోడు భూముల పట్టాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి పులి మధుసూదన్, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు బింగి మహేష్, ఇప్పపూల అజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సంపు స్వామి, పుల్కం రాజు, పులి రాంబాబు, కరుణాకర్, సంఘం నాయకులు ఈర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 22: జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్ ప్రేమలత అన్నారు. మార్చి 9న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు హాలులో గురువారం ఇన్సూరెన్స్ కంపెనీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ కేసుల్లో దాదాపు 850 కేసులు పెండింగ్ ఉన్నాయని, ఇందులో 280 పరిష్కారమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇరువర్గాల్లోని కక్షిదారుల్లో ఎవరికైన ఆర్థిక స్థోమత లేకపోయిన న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే సేవలు అందిస్తుందన్నారు. సమావేశంలో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు రమణారెడ్డి, వెంకట్, పర్శరాములు పాల్గొన్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నింపి రైతులను ఆదుకోవాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 22: అన్నపూర్ణ రిజర్వాయరును కాళేశ్వరం జలాలతో నింపి రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఎర్రటి ఎండలోను అలుగులు పారాయని, నేడు ఎందుకు ఇబ్బంది ఏర్పడుతుందో ప్రభుత్వం ఆలోచించుకోవాలని సూచించారు. రైతులపై క్షక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. మూడు రోజులలో అన్నపూర్ణ రిజర్వాయరుకు నీటిని విడుదల చేస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే నెలరోజులు గడిచిన పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ గొడుగు తిరుపతి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు జక్కుల నాగరాజు, సలీం, గజ్జల రాజశేఖర్, చందన్, అంతగిరి అశోక్, భాస్కర్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు హంగామా

ముస్తాబాద్, ఫిబ్రవరి 22 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జ్ఞానాచారి, అధ్యాపకులు సీహెచ్ రాజు, గంగల్ల నర్సింలు, విజయ్‌కుమార్, మురళి, ప్రవీణ్, బి రాజు, మహేశ్, సునీత, వినీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయోగాలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 22: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వారితో సాంకేతిక ప్రయోగాలను చేయిస్తున్నామని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్, ల్యాబ్ ఇన్‌చార్జ్ పాకాల శంకర్‌గౌడ్ తెలిపారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్ షాప్‌ను నిర్వహించారు. 52 మంది విద్యార్థులకు రోబోటిక్స్ కోడింగ్ సెన్సార్ల వాడకం వినూత్న ఆలోచనలకు అనుగుణంగా ప్రయోగాలు చేయడాన్ని నేర్పిస్తున్నామని తెలిపారు. స్థానికంగా విద్యార్థులు గమనించిన సమస్యల అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిష్కారం కనుగోని ఎగ్జిబిట్‌లను తయారు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు సరిత, శ్రీహరి, రజితలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, ఫిబ్రూవరి 22: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ గంభీరావుపేట మండల కాంగ్రెస్ మైనార్టీ నాయకులు గురువారం కలిసారు. అజ్మతుల్లా హుస్సేనీని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి, సన్మానించారు. అజ్మతుల్లా హుస్సేనీని కలిసిన వారిలో కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు యాసీన్, నాసీర్, ఆస్మీ, మక్‌సూద్, నజిమొద్దీన్ తదితరులు ఉన్నారు.

- సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ వక్ఫ్‌బోర్డు చైర్మెన్‌గా నియమాకమై బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొండూరు గాంధీ హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్చం అందజేసి. శాలువాతో సత్కరించి, సన్మానించారు.



వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లాను సన్మానిస్తున్న నాయకులు

కుష్టువ్యాధి నివారణ బృందం పర్యటన

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని నేరేళ్ల, తంగళ్లపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రాలను రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు గురువారం పర్యటించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కుష్టు వ్యాధికి సంబంధించి రికార్డులతో పాటు రోగుల వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ కుష్టు వ్యాధి వ్యాప్తి గురించి చికిత్స లక్షణాలు, నివారణ చర్యలు తదితర అంశాలను వివరించారు. కుష్టువ్యాధి నిర్మూలన కు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రబృందం సభ్యులు వెంకటేశ్వరచారి, అరుణ, సురేందర్, కాశీనాథం, శ్రీనివాస స్వామి, వైద్యాధికారులు రేఖ, సురేష్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాదని రాష్ట్ర టీం డిప్యూటీ పీఎంవో వెంకటేశ్వరచారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దని సూచించారు. కమిటీ సభ్యులు సకలరెడ్డి, అరుణ, సురేందర్, కాశినాథ్, సురేష్, శ్రీనివాసస్వామి, వైద్యాధికారిణి శరణ్య, శాంత, వెంకటరమణ, లలిత, ప్రేమలత, జవహర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ అనురాగ జయంతి సూచించారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సందర్శించారు. అసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల తీరును పరిశీలించారు. ఆసుపత్రికి సాధారణ పేషెంట్లు, గర్భిణీలు ప్రతిరోజు ఎందరు వస్తున్నారో ఆసుపత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి కొత్తగా వచ్చిన స్టాఫ్ నర్సులను మెటర్నిటీ వార్డులో ఎక్కువ సేవలు అందించేలా చూడాని, ఔట్ పేషెంట్ రిసెప్షన్ కౌంటర్‌ను కార్పొరేట్ స్థాయిలో కనిపించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అనంతరం రోగులకు అందించే మందుల నిల్వ చేసే గదులను పరిశీలించి మందుల వివరాలను తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులకు పరీక్షలు నిర్వహించే గదిని పరిశీలించారు. గర్భిణులు వేచిఉండేందుకు నూతనంగా 40 సిట్టింగ్ సామర్థ్యంతో నిర్మించిన హాల్‌ను పరిశీలించారు. టిఫా స్కానింగ్‌లు ఎక్కువ చేయాలని, అవసరమైతే కొత్తగా రేడియాలజిస్టును నియమించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బాలింత వార్డును పరిశీలించి వారికి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల వార్డు, ఎస్ఎన్సీయూ వార్డును సందర్శించి వైద్యుల వివరాలను, ఎంత మంది చిన్న పిల్లలకు వైద్యం అందుతుందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసుపత్రి పర్యావేక్షకులు సంతోష్, మురళీధర్‌రావు, మున్సిపల్ ఈఈ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



ఫార్మసీలోని మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 22: తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. జిల్లాలోని ఆయా బల్దియాల పరిధిలో ప్రస్తుతం ఎక్కడా తాగునీరు సమస్య లేదని ఆమె తెలిపారు. అంతకుముందు.. రానున్న వేసవిలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్యదేవరాజన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. మున్సిపాలిటీల పరిధిలో ఎక్కడా తాగునీరు సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంక్‌ల నుంచి ప్రతీ ఇంటికి నీరు సరఫరాలో ఏమైనా లోపాలు ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, బల్దియాల పరిధిలో అందరికీ నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వడదెబ్బ నియంత్రణ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు నిత్యం చేయించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ పార్కుల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ గౌతమి, అధికారులు

మినీ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు శనివారం డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మినీ జాబ్ మేళను సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేంధర్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీరామ ఫైనాన్స్, ఇన్సూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగాలు కల్పించేందుకు శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయం ఎఫ్-16 మొదటి అంతస్తులో జాబ్ మేళ ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి 35 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న అభ్యర్థులు(యువతి, యువకులు)అర్హులని వేతనం నెలకు రూ. 10 వేల నుండి 16 వేల వరకు ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు రావాలని తెలిపారు. వివరాలకు 9912178932, 9963357250 నంబర్‌కు సంప్రదించాలి సూచించారు

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గంభీరావుపేట, పిబ్రవరి 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. బిజెడ్ ఫీన్సర్వ్ వంటి ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 40 మంది నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. ఇందులో 12 మంది టెలి కాలర్స్‌గా, ముగ్గురు హెచ్ఆర్ సెకండ్ రౌండ్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులు, నిరుద్యోగులు జాబ్‌మేళా కార్యక్రమానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

గీత కార్మికుడికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 22: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిలివేరి రాజమల్లయ్య గురువారం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య వృతిరీత్య కల్లు గీస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ప్రమాదంలో రాజమల్లయ్య కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

తాత్కాలిక రోడ్డును పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్



రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేఆది శ్రీనివాస్

చందుర్తి, ఫిబ్రవరి 22: చందుర్తి నుంచి మోత్కురావుపేట వెళ్లే రహదారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి జాతరకు జగిత్యాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులను చేపట్టగా పనులను పరిశీలించారు. స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ రోడ్డు ద్వారా వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

నాటక రంగ ప్రముఖుడు రాజేశం మృతి



రాజేశం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 22: భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాటక రంగ ప్రముఖుడు మ్యాదారం రాజేశం (65) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రాజేశం వృత్తి రీత్యా లోయర్ మానేరు డ్యాం క్యాంపులో ట్రెసర్‌గా, డ్రాఫ్ట్ మెన్‌గా, జెటీఓగా పనిచేశారు. నాటక రంగంపై ఆసక్తితో ఎల్ఎండీలో తిమ్మాపూర్ గ్రామ నవోదయ సమితి కళాకా రులతో, నీటిపారుదల శాఖ ఉద్యోగి గోపన్నతో కలసి శ్రీవేంకటేశ్వర కళా సమితిని ప్రారం భించారు. రాజేశం మృతి పట్ల జిల్లా సాంస్కృతిక సంస్థల, కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైఎస్ శర్మ, గజ్జె లక్ష్మణ్, కుమార్ మహర్షి, అనిల్‌కుమార్‌గౌడ్, జి కృపాదానం, జి రఘువీర్‌సింగ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామానికి చెందిన కొత్తూరి మోహన్(19) అక్కడికక్కడే మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. మోహన్ తన ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి 11:30 గంటలకు వల్లంపహాడ్‌లోని తన ఇంటి నుంచి కిరాణం షాపునకు వెళ్తుండగా ఎదురుగా రాంగ్‌రూ ట్‌లో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో మోహన్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి కొత్తూరి రవి ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద..

పాలకుర్తి, ఫిబ్రవరి 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎంఎ ఖదీర్(53) రామగుండం ట్రెజరరి కార్యాలయంలో సబ్ ఆర్డినేట ర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాది రిగానే పెద్దపల్లి నుంచి రామగుండంకు ద్విచక్రవాహనం (టీఎస్ 02ఈసీ 7358)పై వెళుతున్నాడు. ఆ సమయం లో టోల్‌గేట్ వద్ద ఓ లారీ నిలిపి ఉంది. అదే సమ యంలో మరో లారీ (టీఎస్ 01 యూబీ 3847) పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు వెళ్లుతోంది. ఒక లారీ నిలిపి ఉండడం మరోలారీ పక్కనుంచి వేగంగా దూసుకొచ్చింది. దీంతో బైక్‌పై ఉన్న ఖదీర్‌ను లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో ఖదీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రోడ్డు ప్రమాదానికి కారణమైన రెండు లారీలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై తెలిపారు.

ధర్మపురిలో వివాహిత..

ధర్మపురి, ఫిబ్రవరి 22: ధర్మపురి పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో తొట్ల గంగవ్వ(55) అనే మహిళ గురువారం రాత్రి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన గంగవ్వ సమీపంలో గల సమ్మక్క-సారలమ్మ దర్శనం కోసం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరొకరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గంగవ్వకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉదయ్‌కుమార్ పరిశీలించారు.

కరీంనగర్‌లో ఆటో డ్రైవర్..

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22 : కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రి చౌరస్తాలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హుస్సేనిపురకు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ అఫ్జలొద్దీన్(45) మృతి చెందాడని రెండో రాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు విద్యార్థులను తీసుకువెళుతూ సన్‌రైజ్ ఆసుపత్రి చౌరస్తాలో ఒక స్కూటీని తప్పించబోయి ట్రాఫిక్ స్టాండ్‌ను ఢీకొట్టాడని తెలిపారు. అఫ్జలొద్దీన్ తలకు, చేతులకు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని రైతు ..

కథలాపూర్, ఫిబ్రవరి 22: మండలంలోని కలికోటలో బుధవారం రాత్రి మిరప తోటకు కాపలా వెళ్తున్న రైతును కారు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోలి నరసింహారెడ్డి (55) అనే రైతు తన మిరప తోట వద్దకు కాపలా నిమిత్తం వేములవాడ - కోరుట్ల రోడ్డు వెంట నడిచి వెళ్తున్నాడు. కోరుట్ల నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న కారు నరసింహారెడ్డిని అతివేగంతో ఢీకొట్టింది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు చికిత్స నిమిత్తం కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రుద్రంగికి చెందిన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడు..

కోరుట్ల, ఫిబ్రవరి 22: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొమురపల్లి రాకేష్ (35) అనే యువకుడు మెట్‌పల్లి వైపు వెళుతున్నాడు. పట్టణ శివారులోని కావేరి గార్డెన్ వద్ద నాగులపేట గ్రామం నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రాకేష్ తీవ్రగాయాలై సంఘటన స్థలంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒకే భూమిని పలువురికి విక్రయించిన కేసులో ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 22: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఒకే భూమిని పలువురికి విక్రయించి మోసగించిన ముగ్గురు వ్యక్తులను ఎల్ఎండీపోలీసులు గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందిరానగర్ గ్రామంలోని సర్వే నంబరు 752/బీలో 600చదరపు గజాల(నాలుగు ప్లాట్లను) భూమిని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రంగు వెంకటాచారి కొనుగోలు చేశాడు. ఈ భూమిని కరీంనగర్‌లోని కార్ఖానగడ్డకి చెందిన నజీర్ అహ్మద్ ఖాన్ పేర ఉంది. కరీంనగర్‌లోని అహ్మద్ పురకి చెందిన మోహ్మద్ సిరాజుద్దీన్ పేర జీపీఏ హోల్డర్‌గా ఉన్నాడు. ఈ భూమి తన పేర అగ్రిమెంట్ ఉన్నదని తిమ్మాపూర్ కి చెందిన శ్రీరామోజు శ్రీనివాస్ చెప్పి వెంకటచారితో 10 లక్షల,95వేల రూపాయల ధర చెసుకున్నాడు, ఇందుకు గాను అదే రోజు వెంకటాచారి నుంచి 1,95వేల రూపాయలు అడ్వాన్స్ శ్రీరామోజు శ్రీనివాస్ తీసుకున్నాడు. 2013లో జనవరిలో మిగతా డబ్బులు చెల్లించి వెంకటచారి రిజిస్ట్రేషన్ చెయించుకున్నాడు. అనంతరం 2022 మార్చిలో వెంకటచారి తను కొనుగోలు చేసిన భూమి వద్దకు వెళ్ళి చదును చేస్తుండగా నన్నపరాజు నరేందర్ రాజు అక్కడికి చేరుకొని అడ్డుకున్నాడు. తను అ భూమిని దాసరి స్వాతి అనే వారి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను చూపించాడు. స్వాతి 2013లో కప్ప మోహన్ సింగ్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు నరేందర్ రాజు దస్తావేజులను చూపించాడు. దీంతో అవాక్కయిన వెంకట చారి తను మోసపోయినట్లు, ఒకే భూమిని పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో శ్రీరామ శ్రీరామోజు శ్రీనివాస్, సజీర్ అహ్మద్, జీపీఏ అయిన మహమ్మద్ సిరాజుద్దీన్‌పై ఫిర్యాదు చేశాడు. బాధితుడు వెంకట చారిని చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శ్రీరామోజు శ్రీనివాస్, నజీర్ అహ్మద్ ఖాన్, మహమ్మద్ సిరాజుద్దీన్ లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాకితే మాడిమసై పోతారు

- ప్రతిపక్షాలు ఆత్మ విమర్శ చేసుకోవాలి - మంత్రి పొన్నం ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్ను కున్న తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాల్చేస్తాం, కూల్చేస్తామంటూ ప్రతిపక్షాలు అవాకులు, చవాకులు పేలుతున్నాయని, తమ ప్రభుత్వాన్ని తాకితే మాడిమసై పోవడం ఖాయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తి సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణతో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండు నెలల ప్రజా ప్రభుత్వం పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు పన్నుతు న్నాయని మండి పడ్డారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, తెలంగాణాలో బీజేపీ ఆటలు సాగవని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 70 రోజులు కాకముం దే ఓపిక కోల్పోయి స్పష్టత లేక మాట్లా డుతున్నారని, గత ప్రభుత్వాలు ఆత్మవి మర్శ చేసుకోవలసిన అవసరముందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని అన్నారు. కేసీఆర్ సహకారంతో కిషన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారని, అసలు బండి సంజయ్ కుమా ర్‌ని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తప్పించారో తెలుపాలని ప్రశ్నించారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, మార్చిలో మరో రెండు సంక్షేమ పథకాలను తప్పక అమలు చేస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇస్తు బాగుంటుందని సూచించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● ఆలయ అభివృద్ధికి సహకారం

శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీం ద్రస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగి రీంద్రస్వామిని గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి మంత్రి పొన్నం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పాలకవర్గ సభ్యులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వారికి ఆశీర్వాదం అందించారు. అనంతరం మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడారు. భక్తులకు సౌకర్యార్థం దేవుడిఆశీస్సులతో మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. కొత్తగట్టు గుట్టపైన భక్తుల సౌకర్యార్థం తాగునీరు సమస్యను తీర్చడం కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఆలయ ఛైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాచరిక పాలనకు గుణపాఠం

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్కీంలు స్కాంలకే - కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 22: తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల రాచరిక పాలనకు ప్రజలు విసిగిపోయి అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడటం అర్థరహితమన్నారు. కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్‌లు తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ జైలుకు వెళ్లలేదని, లాఠీదెబ్బలు తిన లేదని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్షతో, హరీష్‌రావుకు అగ్గిపెట్టె దొరక లేదని యువతను రెచ్చగొట్టడం మూలంగా శ్రీకాంతాచారితో పాటు 12 వందల మంది ఆత్మహత్యలు చేసుకు న్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టులతో కేసీఆర్, హరీష్‌రావులు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ స్కీంలు స్కాంల కోసమేనని, కాంగ్రెస్ స్కీంలు మాత్రం రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమని ఆయన అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం కోసం కాంగ్రెస్‌పార్టీ నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తానని గజ్జెల కాంతం తెలిపారు. సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యు వజన సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల అజయ్, నాయకులు దండి గణేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిశువు అపహరణ కేసులో వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22: కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఈనెల 18న జరిగిన శిశువు అపహరణ ఘటనలో అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ వీరారెడ్డి ఈ సంఘనపై విచారణ జరిపించారు. సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు అపహరణ జరిగినట్లు విచారణలో తేలడంతో బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 10 మంది నర్సింగ్ సిబ్బంది, ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మల్లాపూర్, ఫిబ్రవరి, 22: మండలంలోని సిర్పూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను బుధవారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్ప దంగా వెళ్తున్న వాహనం(ఏపీ16టీజీ7036) తనిఖీ చేయగా 15క్వింటాల రేషన్ బియ్యం తరలిస్తుండడాన్ని గుర్తించారు. వారిని విచారించగా మండలంలో సేకరించిన రేషన్ బియ్యా న్ని మెట్‌పల్లికి తరలిస్తున్నట్లు వారు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనం, బియ్యం స్వాధీనం చేసుకొని ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడ్డారనే ఆరోపణలపై గురువారం మరొకరిని అరెస్టు చేశారు. రెండు రోజుల కిందట 9 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు అదే రోజు నందెల్లి మహిపాల్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో గట్టుబూత్కూరు మాజీ సర్పంచ్ గంగాధర కనుకయ్యను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కనకయ్యను కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కనుకయ్యను పోలీసులు జైలుకు తరలించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం

- పెద్దఎత్తున భక్తుల రాక- హాజరైన ఎమ్మెల్యే దంపతులు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 22: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అశ్వ వాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వారలను భాజ భజంత్రీలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు దంపతులు, కుటుంబ సభ్యులు, ఈవో వి అనూష మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఎదుర్కొని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో నృసింహ స్వామి కల్యాణం వైభవంగా అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజనీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, యాగ్నీకులు శ్రీనాథాచార్యులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంరూపాదేవి, జడ్పీటీసీ ప్రశాంతి హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, పూడూర్ సింగిల్ ఉపాధ్యక్షుడు రమేష్, మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రూ. లక్ష 28వేల ఆదాయం..

నల్లగొండలో గురువారం నిర్వహించిన శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణానికి లక్ష 28వేల 996రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈవో అనూష తెలిపారు. ఆలయంలో వేలం, ఆలయం నుంచి అమ్మిన టిక్కెట్లు, దాతలు స్వామి వారికి చదివించిన కట్నాల ద్వారా ఈ నగదు సమకూరినట్లు ఈవో తెలిపారు.

సహకార బ్యాంకుల అభివృద్ధికి సహకరించాలి

- ప్రభుత్వ, స్థానిక సంస్థలు ఖాతాలు తెరవాలి - నాఫ్స్ కాబ్ ప్రాంతీయ సమావేశంలో తీర్మానం



కర్ణాటక సీఎంను సన్మానిస్తున్న నాఫ్స్ కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 22: సహకార బ్యాంకుల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల, దేవాదాయశాఖ కరెంటు ఖాతాలను తెరిచి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరుతూ నాఫ్స్ కాబ్ ప్రాంతీయ సమావేశంలో తీర్మానించారు. గురువారం బెంగుళూరులో రాష్ట్ర సహకారశాఖ మంత్రి కె.రాజన్న సౌజన్యంతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధ్యక్షతన నాఫ్స్‌కాబ్ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరైనట్లు రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సహకార బ్యాంకుల ద్వారా మొత్తం క్రెడిట్‌లో ప్రస్తుతం ఉన్న 13శాతం నుంచి 50శాతానికి వాటాను 2022 నుంచి 2047 వరకు చేరుకునేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలని చర్చలు చేసినట్లు తెలిపారు. జిల్లా బ్యాంకుల వ్యాపారాన్ని విస్తరించుట, వ్యవసాయంతో పాటుగా ఇతర వాణిజ్య కార్యకలాపాలకు రుణాలు మంజూరు చేయడం, డిపాజిట్ల సేకరణ, సహకార సంఘాల ద్వారా వ్యాపార కార్యకలాపాలు విస్తరించుట తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల రాష్ట్ర సహకార బ్యాంకుల అధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్లు, జిల్లా అధ్యక్షులు, సీఈవోలు, కర్ణాటక బ్యాంకు రాష్ట్ర అధ్యక్షుడు, నాఫ్స్‌కాబ్ ఎండీ బీమ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడి ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలు శిక్ష లేదా ఇద్దరికి కలిపి మొత్తం 3,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ముగ్గురు వాహనదారులకు 5,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదం చేసిన వ్యక్తికి రిమాండ్

ముస్తాబాద్, ఫిబ్రవరి 22: రోడ్డు ప్రమాదం చేసి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెష్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం ముస్తాబాద్ నుంచి లింగన్నపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తుర్కపల్లె గ్రామానికి చెందిన ఆనంద్ ఎదురుగా ఆటోతో వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సింలు మరణించగా దేవయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మృతికికారణమైన ఆనంద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

మానకొండూర్, ఫిబ్రవరి 22: మండలంలోని చెంజర్ల గ్రామ శివారు కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి.చెంజర్ల గ్రామంలోని దాణా కంపెనీలో పని చేస్తున్న మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ప్రశాంత్ (40) శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ప్రసాద్ (43) అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై చెంజర్లపై వస్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందని 108 ఈఎంటీ చిరంజీవి, పైలెట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి, ఫిబ్రవరి 22: ఎదురుగా వస్తున్న ఓ కారును తప్పించబోయిన ఓ ద్విచక్రవా హనదారుడు రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో యువతి, యువకుడికి గాయాలైన సంఘటన చందుర్తి మండలం బండపల్లి, ఎనగల్ గ్రామాల మధ్య గురువారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బండపల్లి గ్రామంలో కార్మికులకు వైద్య సేవలు అందించి తిరిగి వేములవాడకు బైక్ పై వస్తున్న అభిషేక్ (26) నీలోఫర్ (25) అనే వైద్య మిషన్ శాఖలో పనిచేస్తున్న యువతీయువకులు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి చెట్టుకు ఢీకొన్నారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, ఫిబ్రవరి 22: ధర్మపురి మండలంలోని చిన్ననక్కల పేట గ్రామానికి చెందిన బోర్లకుంట రాజన్న (50) అనే వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకు న్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొద్ది రోజులుగా రాజన్న మతి స్థిమితం లేక ఇంటి వద్దనే అన్న పెద్దపోశం వద్ద ఉంటున్నాడు. గురువారం ఉదయం పెద్దపోశం ధర్మపురి మార్కెట్‌కు పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి క్రిమిసంహారక ముందు తాగి రాజన్న మృతి చెంది ఉండటాన్ని గుర్తించాడు. అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 22: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన పెగడ దేవక్క (53) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో సమ్మక్క సారలమ్మ పండుగ నిర్వహణ విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడింది. దీంతో క్షణికావేశంలో దేవక్క ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు



జైలు నుంచి విడుదలైన వారికి స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 22: పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాటం ఆగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ రమణ, కరీంనగర్ జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. జగిత్యాలలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేసి జైలుకు వెళ్లి గురువారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదలైన నాయకులకు సీపీఎం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ భూమిలో వందలాది ఎకరాల్లో 15వేల మంది పేదలతో భూ పోరాటం చేసిన నాయకులు 38 రోజుల పాటు జైలులో ఉన్నారన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలు దక్కేంత వరకు సీపీఎం ప్రజా సంఘాలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు పుప్పాల శ్రీకాంత్, గోరెంకల నర్సింహ, వర్దవెంకట్‌రెడ్డి గీట్ల ముకుంద రెడ్డి, డి నరేష్‌పటేల్, లెల్లల భవాని, కొప్పుపద్మ, జిరమేష్, చంద్రయ్య, వెంకటా చారి, రఫిక్, వినోద్, గజ్జల శ్రీకాంత్, నవీన్, గణేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం


చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు


సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.


సమ్మక్క గద్దె

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్ళ, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.


క్యూలైన్లలో భక్తుల రద్దీ







ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ భీమా శర్మ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 22: సిరిసిల్ల డిఎస్పీగా భీమా శర్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డిఎస్పీ ఉదయ్‌రెడ్డి చార్జి ఇచ్చి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ భీమా శర్మను సిరిసిల్ల పోలీస్ సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు పరిశీలన

గంభీరావుపేట, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవన పనులను జడ్పీ సీఈవో ఉమారాణి గురువారం పరిశీలించారు. పనుల ప్రగతితో పాటు పనుల వేగవంతంపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్లాంటేషన్ చేయాలని సూచించారు. నాగంపేట వైకుంఠధామం సందర్శించి సదుపాయాలు తెలుసుకున్నారు. కోళ్ళమద్ది, ముస్తాఫనగర్, నాగంపేట గ్రామాల్లో జడ్పీ నిధులతో చేపడుతున్న తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. డిప్యూటి సీఈవో గీత, ఎంపీడీవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

హర్యానా ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: యువ రైతు మరణానికి కారణమైన హర్యానా ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు, కౌలు రైతులు నిరసనలకు పూనుకుంటే హర్యానా, పంజాబ్ రాష్ట్రాల సరిహద్దులో హర్యానా పోలీసులు విచక్షణ రహితంగా కాల్పులు జరపడం పంజాబ్‌కు చెందిన యువ రైతు శుభకరన్‌సింగ్ మరణించడం దురదృష్టకరమన్నారు. యువ రైతు మరణానికి కారణమైన హర్యానా ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేస్తూ కాల్పులు జరిపిన హర్యానా పోలీసులపై హత్యా నేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కాల్పులను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఖండించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

మేడారం జాతరకు విద్యాసంస్థలకు సెలవు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండగ అయిన సమక్క సారక్క మేడారం జాతరకు ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే సమ్మక్క సారక్క మేడారం జాతరకు విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మట్టె శ్రీనివాస్, కొలనూరి కరుణాకర్, రుద్రవేని ధనుష్, నరేష్, నవీన్, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు నీటిని విడుదల చేయాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 22: వరి పంటలకు రైతులకు నీటిని విడుదల చేయాలని ముస్తాబాద్ మండలం పోతుగల్, గన్నెవానిపల్లె, తంగళ్లపల్లి మండలం లచ్చపేట గ్రామరైతులు గురువారం తహసీల్దార్ సురేశ్‌కు వినతి చేశారు. భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు పేర్కొన్నారు. వేసవి సమీపిస్తుండటంతో పంటపొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ముస్తాబాద్ పెద్ద చెరువు నింపి మత్తడి ద్వారా ఎల్లమ్మ వాగులో నీరు పారేలా చూడాలన్నారు. లేకుంటే దాదాపు 1000 ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మల్లేశం, హన్మంతు, రఘు, ఎల్లయ్య, అంజయ్య, లక్ష్మయ్య, నర్సయ్య, బాల్ నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంను గురువారం సిరిసిల్ల పట్టణం 20 వార్డు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. మేడిపల్లి సత్యం చిత్రపటాన్ని బహుమతిగా అందించారు. కార్యక్రమంలో నాయకులు బీపేట కుమార్‌యాదవ్, కొండ రాజు, ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తుల పరిశీలన వేగవంతం

- డీపీవో వీరబుచ్చయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 22: జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేస్తున్నామని, సుమారు నాలుగు వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పేర్కొన్నారు. మార్చి 15 లోగా ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులు, గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే, ఇంటి పన్ను తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో వీరబుచ్చయ్య మాట్లాడుతూ జిల్లాలోని 255 గ్రామాలకు గాను 204 గ్రామాల్లో పథకానికి సంబంధించి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించేలా చర్యలు చేపట్టామన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తం 164 దరఖాస్తులు వచ్చాయని లబ్ధిదారుల ఇంటి వద్దకు పంచాయతీ కార్యదర్శి వెళ్లి పరిశీలించి అర్హుడు, అనర్హుడిగా గుర్తించడం జరుగుతోందని అన్నారు. జిల్లాలో ఇంటి పన్నులు రూ 5.56 కోట్ల వసూళ్లకు ఇప్పటి వరకు రూ 4.97 కోట్లు వసూలయ్యాయని తెలిపారు. మార్చి 15 లోగా 100 శాతం పూర్తి చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు పాటు పడాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తడి, పొడిచెత్తను ఇళ్లలో వేర్వేరు బుట్టల్లో వేసి పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛతకు కృషి చేయాలని డీపీవో కోరారు. ఆయన వెంట ఎంపీవో వజీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి దేవరాజు తదితరులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న డీపీవో వీరబుచ్చయ్య

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చందుర్తి, ఫిబ్రవరి 22: మండలంలోని మూడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు గోవిందుడి కల్యాణాన్ని తిలకించడానికి హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా గురువారం జరిగాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేంకటేశ్వరస్వామి వారి నామ స్మరణ చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ జెపి రావు, నాయకులు చిలుక అంజిబాబు, జువ్వాడి అనిల్ రావు, తిప్పని శ్రీనివాస్, భైరగోని రమేష్, దుమ్మ అంజయ్య, బాణాల రవీందర్‌రెడ్డి, చింతపంటి రామస్వామి, పొద్దుపొడుపు లింగారెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, వట్టిమల్ల రవి, పుల్కం మోహన్, పుల్కం లచ్చయ్య, సంటి ఏసుదాసు, నీరటి శ్రీనివాస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సమీక్ష

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 22: సిరిసిల్ల పట్టణం జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌పీలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీరాములు, నయిమా, డీడీఎం, డీపీవో, డిప్యూటీ డెమ్, హెచ్‌ఈ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్ బదిలీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 22: ఎల్లారెడ్డిపేట మండల నాయబ్ తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న జయంత్ కుమార్ గురువారం బదిలీ అయ్యారు. కోనరావుపేట నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ ఇక్కడకు బదిలీపై రానున్నారు. నాలుగేళ్లుగా నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన జయంత్‌కుమార్ కోనరావుపేటకు బదిలీ అయ్యారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


డైరీని ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, జర్నలిస్టులు

వేములవాడ, ఫిబ్రవరి 22: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) ఆధ్వర్యంలో ముద్రించిన 2024 మీడియా డైరీని గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ డైరీలో పొందుపరిచిన సమాచారం జర్నలిస్టులకే కాకుండా ప్రభుత్వ అధికారులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉందని అంటూ టీయూడబ్ల్యూజేను అభినందించారు. కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే ఐజేయూ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు దాసరి దేవేందర్, జిల్లా కార్యదర్శి ముత్యం, కోశాధికారి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు తడక శ్రీనివాస్, వేములవాడ ప్రెస్ క్లబ్ ఫౌండర్ రేగుల దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, దాడుల నివారణ కమిటీ కన్వీనర్ కొక్కుల శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కొత్త హరి, కోనరావుపేట, రుద్రంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, దేవారెడ్డి, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునః ప్రతిష్ఠాపన


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 22: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలోని భక్తులు అంజనేయ స్వామి చిత్రపటంతో గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఎంపీపీ రేణుక, వేములవాడ ఆలయ ఈఈ రాజేశ్, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మెల్యే కేటీఆర్ పీఏలు గన్‌రాజ్, మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో సత్తయ్య తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు కొమిరిశెట్టి తిరుపతి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అపెరాసుల్తానా, మాజీ సర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు నర్సయ్య, సుధాకర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, హనుమండ్లు, శ్రీధర్, లక్ష్మారెడ్డి, కిషన్, గౌస్, మల్లేశం పాల్గొన్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేసుకుందాం

వేములవాడ, ఫిబ్రవరి 22: మార్కెట్లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేసుకొని విక్రయించుకోవాలని శాలివాహన కుమ్మర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేశం అన్నారు. జిల్లా శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కుమ్మరులకు ఖాదీ గ్రామీణ సౌజన్యంతో తాండూరుకు చెందిన శిక్షకుడు శంకరప్ప 10 రోజుల పాటు 20 మందికి శిక్షణ అందించారు. గురువారం శిక్షణ ముగింపు సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేసుకొని అమ్ముకునే విధంగా శిక్షణను అందించామని తెలిపారు. శిక్షణ పొందిన 20 మందికి మట్టి పాత్రలు తయారు చేసేందుకు యంత్రాలను కూడా అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ శాలివాహన సంఘం అధ్యక్షుడు అన్నారపు అంజయ్య, దశరథం, రాములు, మల్లేశం తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఇల్లంతకుంట: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన ఆందోళనకు మండలంలోని సర్పంచులు తరలివెళ్లారు. వీరిలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చల్ల నారాయణ, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, పర్శరాం, బాగ్యలక్ష్మిబాలరాజు, బిల్లవేని పర్శరాం తదితరులు ఉన్నారు..

గంభీరావుపేట: మండల కేంద్రంలోని 3వ వార్డులో ఎంపీ బండి సంజయ్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం 12 లక్షలు మంజూరు అయ్యాయి. వాల్మీకి బోయ సంఘం నుంచి దుబ్బాక పోచమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డును నిర్మించనున్నారు. ఎంపీకి వార్డు సభ్యులు లక్కిరెడ్డి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చందుర్తి: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్యయ్య తెలిపారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 37 లక్షల 65 వేల రూపాయలు మంజూరు చేశారన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణంతో పాటు చందుర్తిలో మాల సంఘానికి ఐదు లక్షలు, మాదిగ సంఘానికి ఐదు లక్షలు, శివాజీ విగ్రహ గద్దె వద్ద హైమాస్ట్ లైట్, డ్రైనేజీ నిర్మాణానికి 27 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగదొడ్ల నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు మంజూరు అయినట్లు ఏఈ వనజ తెలిపారు.

- అధిక ఉష్ణోగ్రతలతో వరికి అగ్గితెగుళ్లు బాక్టీరియా వస్తుందని తగిన జాగ్రత్తలు నివారణ చర్యలు తీసుకుంటే దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి వి భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు, తుర్కపల్లె, ఆవునూర్ గ్రామాల్లో పొలాలను పరిశీలించారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ యూకే ఆధ్వర్యంలో శుద్ధ జలకేంద్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రాణి, ఎంపీటీసీ మమతమహేష్, ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ మండలాభిషేక మహోత్సవం మయూరగిరి పీఠాధిపతులు నమిలికొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: మండలం బండలింగంపల్లి జడ్పీ పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా సింగారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రారంభించారు.